సాక్షి కామారెడ్డి

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదవుతున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటోడ్రైవర్లు ఆందోళనకు దిగారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.3 /14.1

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

21 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా ఈనెల 21 వరకు బియ్యం పంపిణీ కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు బియ్యం తీసుకోని వారు ఈ గడువును వినియోగించుకోవాలని సూచించారు.

23న జిల్లా స్థాయి యువజన పోటీలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో ఈ నెల 23న జిల్లాస్థాయి యువజన ఉత్సవాల పోటీలను స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమ, క్రీడల అధికారి వై దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యాలు, కథ రచన, పోస్టర్ మేకింగ్, డిక్లమేషన్, ఫొటోగ్రఫీ, యువకృతి అంశాలపై పోటీలుంటాయని ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని జిల్లా యువజన సంక్షేమ అధికారి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9440292793, 9618126053 నంబర్లకు లేదా కలెక్టరేట్ 223 నంబర్ గదిలో సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ తరగతులపై అధ్యాపకులకు శిక్షణ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో సోమవారం అధ్యాపకులకు డిజిటల్ పాఠ్యాంశాల రూపకల్పన, పవర్ పాయింట్ ద్వారా బోధనలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ కె విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి డిజిటల్ తరగతులు ఉపయోగ పడుతాయన్నారు. ఇందుకు అనుగుణంగా అధ్యాపకులు సాంకేతికపరంగా సిద్ధం కావాలని సూచించారు. ఫిజిక్స్ హెచ్‌వోడీ పి రామకృష్ణ, ఐక్యూఏసీ సమన్వయ కర్త ఎం చంద్రకాంత్, అకడమిక్ సమన్వయ కర్త వి శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠ్యప్రణాళికను పాటించాలి



మాచారెడ్డి: ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక రూపొందించుకొని సోపానాల ఆధారంగా పాఠాలు బోధించాలని సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ అధికారి వేణుగోపాల్, కమ్యూనిటీ మోబిలైజేషన్ అధికారి శ్రీపతి సూచించారు. మాచారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలు తీరును వారు సోమవారం పరిశీలించారు. బేస్‌లైన్ నెలవారీ పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటాచారీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, సీఆర్పీ సంజీవ్ ఉన్నారు.

గడపగడపకు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు



నిజామాబాద్ సిటీ: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టాపనను పురస్కరించుకుని జిల్లాకు చేరిన అయోధ్య శ్రీరాముడి అక్షింతలను గడప గడపకు పంపిణీ చేసేందుకు వీహెచ్‌పీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా 15 రోజుల క్రితం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గాజుల్‌పేట్ పెద్ద రాంమందిరంలో పెట్టారు. సోమవారం నగరంలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం నుంచి అక్షింతలను జిల్లాలోని అన్ని మండలాలు, అన్ని గ్రామాల్లో గడప గడపకు పంపిణీ చేసేందుకు వీహెచ్‌పీ కార్యకర్తలు అక్షింతలు ఉన్న కళశాలను తీసుకెళ్లారు. వచ్చేనెల 22న అయోధ్య రామమందిర్‌లో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠాపన నేపథ్యంలో అక్షింతలను జనవరి ఒకటి నుంచి 15 వరకు గడప గడపకు పంపిణీ చేయనున్నారు. అక్షింతలతో పాటు మందిరం ప్రారంభానికి సంబంధించిన కరపత్రం, హనుమాన్ చాలీసాను ఇవ్వనున్నారు. కరపత్రాలను వీహెచ్‌పీ ప్రాంత సంఘటిత మంత్రి ముడుపు యాదిరెడ్డి, విభాగ కార్యదర్శి తుమ్మల కృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవహా వారే దస్తగిరి, నగర కార్యవహా గంగనర్సన్న, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్ కదం, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి దయానంద్ ఆవిష్కరించారు.

స్నేహితుడి ఇంటిపై ఆశపడ్డాడు. ఎలాగైనా దానిని దక్కించుకోవాలనుకున్నాడు. మిత్రుడి అడ్డు తొలగించుకోవడం కోసం అతడి కుటుంబంలోని ఆరుగురికి మరణశాసనం లిఖించాడు. నమ్మించి ఒక్కొక్కరిని తీసుకెళ్లి హతమార్చాడు. ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్త పడ్డాననుకున్నాడు. కానీ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానంతో తీగలాగారు. దీంతో డొంక కదిలింది. ఉమ్మడి జిల్లాలో కలకలం సృష్టించిన వరుస హత్యల కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.



స్వప్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

నమ్మించి.. కడతేర్చి..

- ఇల్లు దక్కించుకోవడం కోసం ఆరుగురి హత్య
- ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్తలు
- చిన్న క్లూతో డొంక కదిలించిన పోలీసులు
- విచారణలో వెలుగు చూస్తున్న విస్తుపోయే నిజాలు

సాక్షి, కామారెడ్డి: నిజామాబాద్ జిల్లా మాక్లూరు మండల కేంద్రానికి చెందిన ప్రసాద్ కుటుంబం ఏడాది క్రితం కొన్ని సమస్యలతో ఊరును వదిలి కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటోంది. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. భార్య గర్భంతో ఉంది. ఆయనతో తల్లి, ఇద్దరు చెల్లెళ్లు కూడా ఉండేవారని తెలిసింది.

ప్రసాద్‌కు తన స్వగ్రామానికి చెందిన ప్రశాంత్ మిత్రుడు. ఓ కేసు విషయంలో డబ్బులు అవసరం కాగా ప్రసాద్ తన ఇల్లు అమ్మాలనుకున్నాడు. ప్రశాంత్ ఆ ఇంటిని తానే కొంటానని చెప్పి కొంత డబ్బును అప్పట్లో ఇచ్చినట్లు తెలుస్తోంది. ముందుగా ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే బ్యాంక్ లోన్ తీసుకుని మిగతా డబ్బులు ఇస్తానని ప్రసాద్‌ను ఒప్పించాడు. కాలం గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్నేహితుడి అడ్డు తొలగించుకోవడానికి ప్రశాంత్ పక్కా ప్లాన్ వేశాడు. గతనెల 28న ప్రసాద్‌ను నమ్మించి తీసుకువెళ్లి డిచ్‌పల్లి ప్రాంతంలో హత్య చేసి, మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల తర్వాత ప్రసాద్ భార్యను నమ్మించి తీసుకువెళ్లి బాసరలో హతమార్చి గోదావరిలో తోసేశాడు. ఈనెల 9న ఇద్దరు పిల్లలను తీసుకువెళ్లి 44వ నంబరు జాతీయ రహదారిపై సోన్ బ్రిడ్జి సమీపంలో చంపి గోదావరిలో పడేశాడు. అనంతరం అన్న, వదినలు ఆపదలో ఉన్నారని చెప్పి ప్రసాద్ చెల్లెళ్ల ఇద్దరినీ తీసుకువెళ్లి చంపాడు. ఒకరిని చేగుంట సమీపంలో, మరొకరిని భూంపల్లి సమీపంలో చంపి దహనం చేసినట్టు భావిస్తున్నారు.

కిరాతకంగా చంపి..

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి హత్యలు సినీ ఫక్కీలో జరిగాయి. నిందితుడు నమ్మించి వెంట తీసుకువెళ్లి, ఆ తర్వాత హతమార్చి ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. హత్యలను పరిశీలిస్తే హంతకుడిలోని రాక్షస మనస్తత్వం భయంగొలుపుతుంది. పక్షం రోజుల వ్యవధిలో ఆరుగురిని చంపేశాడు. ఆరు హత్యలు జరగ్గా.. ఇప్పటి వరకు ముగ్గురి మృతదేహాలు మాత్రమే లభించాయి. ప్రసాద్‌తోపాటు అతడి భార్య రమణి, మరో సోదరి స్రవంతి మృతదేహాలు ఇంకా లభించలేదు. నిందితుడు ప్రసాద్ వెల్లడించిన వివరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. మొత్తం సమాచారాన్ని రికార్డు చేసి, ఆధారాలను సేకరించిన తర్వాత నిందితులను రిమాండ్‌కు పంపించే అవకాశాలున్నాయి.

ఇలా వెలుగులోకి..

సదాశివనగర్ మండలం భూంపల్లి శివారులో ఈనెల 13న గుర్తుతెలియని యువతి మృతదేహం కనిపించింది. యువతి శవాన్ని దహనం చేసినట్టు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాలిపోయిన శవం పాదాలు కాలకుండా ఉండడం, కాళ్లకు పట్టీలు ఉండడంతో యువతిగా భావించారు. ఎస్పీ సింధుశర్మ ఆదేశాలతో కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. చుట్టుపక్కల పోలీస్ స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసుల్లో ఎవరైనా హత్యకు గురై ఉంటారేమోనని ఆరా తీశారు. నిర్ధారణ కాకపోవడంతో ఆధారాల కోసం వెతికారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ఆ రాత్రి నేరం జరిగిన ప్రాంతంలో సంచరించిన వ్యక్తుల ఆచూకీ కనుగొన్నారు. వారిని విచారించడంతో వరుస హత్యల సంఘటన వెలుగులోకి వచ్చింది.

కమలం కసరత్తు!

- పార్లమెంట్ ఎన్నికలపై స్పెషల్ ఫోకస్
- నిజామాబాద్, జహీరాబాద్ సీట్లను కైవసం చేసుకునేందుకు ప్రణాళిక
- ఉమ్మడి జిల్లాలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ
- అంతర్గత సమావేశాలతో సునీల్ బన్సల్ బిజీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికలపై కమల దళం కసరత్తు ప్రారంభించింది. శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో సత్తా చాటిన బీజేపీ.. అదే ఊపుతో ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు స్కెచ్ వేస్తోంది. ఇందుకోసం కమల దళం వ్యూహరచన చేస్తోంది. నిజామాబాద్, జహీరాబాద్ ఎంపీ రెండు స్థానాల్లో అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేయడంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ తలమునకలయ్యారు. ఇందుకోసం రెండు రోజులుగా అంతర్గత సమావేశాలను నిర్వహిస్తున్నారు. పార్టీ కీలక నాయకులతో సుదీర్ఘ చర్చ లు జరిపారు. సంఘ పరివార్ నేపథ్యం ఉన్న నేతలతో పాటు కీలక నాయకులందరితో విడతల వారీగా సమావేశమై ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి నలుగురు కార్పొరేటర్లు బీజేపీలోకి వచ్చారు. మరికొందరు చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీ జాతీయస్థాయి కీలక నేతల్లో ఒకరైన సునీల్ బన్సల్ ఉమ్మడి ఇందూరు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించడంతో రాజకీయ వర్గాల్లో మరింత ఆసక్తి పెరిగింది.

పార్టీకి ఊపు తెచ్చిన ఇందూరు

రాష్ట్ర రాజకీయాల్లో మార్పు వస్తుందంటే.. అది ఉమ్మడి ఇందూరు నుంచే మొదలవుతూ వస్తోంది. ఇక్కడ వచ్చిన ఫలితాలు రాష్ట్ర రాజకీయాలను దిశానిర్దేశం చేసే విధంగా ప్రభావితం చేస్తూ వస్తున్నాయి. గత ఎంపీ ఎన్నికల్లో పసుపు బోర్డు హామీతో నిజామాబాద్ ఎంపీ స్థానంలో బరిలోకి దిగిన బీజేపీ విజయఢంకా మోగించింది. అప్పుడు సిట్టింగ్ ఎంపీగా ఉన్న కేసీఆర్ కుమార్తె కవితను ఓడించి.. బీజేపీ తరఫున బరిలో నిలిచిన అర్వింద్‌ను ఇక్కడి ఓటర్లు ఎన్నుకున్నారు. అప్పటి నుంచి పార్టీ జిల్లాలో తన బలాన్ని పెంచుకుంటూ వస్తోంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ పసుపు బోర్డు మంజూరు చేస్తూ ప్రకటన చేశారు. అలాగే ఆ పార్టీ ఇచ్చిన వివిధ హామీలతో జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి, ఆర్మూర్ స్థానాలతో పాటు జిల్లాకు ఆనుకుని ఉన్న ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో నిర్మల్, ఆదిలాబాద్, ముథోల్, సిర్పూర్ స్థానాలను గెలుచుకుంది. ఇందూరు జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాల్లో గెలుపొందడంతో నిజామాబాద్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవచ్చని భావిస్తోంది.

కామారెడ్డి గెలుపుతో మరింత జోష్

అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తారనుకున్న బండి సంజయ్(కరీంనగర్), ధర్మపురి అర్వింద్(కోరుట్ల), సోయం బాపూరావు(బోథ్), రఘునందన్‌రావు(దుబ్బాక), ఈటల రాజేందర్(హుజూరాబాద్) సైతం ఓటమి పాలయ్యారు. కానీ, కామారెడ్డి నుంచి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అటు కేసీఆర్, ఇటు రేవంత్‌రెడ్డిలను ఓడించడంతో పార్టీ హైకమాండ్ ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించింది. కామారెడ్డి ప్రాంతంలో పార్టీకి బలం పెరగడంతో.. అదే ఊపులో జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతోంది. అంతేకాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఇది ఆ పార్టీకి కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీజేపీకి ఎక్కువ శాతం ఓటింగ్ రావడంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే నిజామాబాద్, జహీరాబాద్ ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవచ్చని పార్టీ అధినాయకత్వం నమ్ముతోంది. అందుకే ఈ ప్రాంతంపై స్పెషల్ ఫోకస్ పెట్టింది.

రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు



కామారెడ్డి టౌన్: శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం, శాలువా అందజేశారు.

ఎంపీ నియోజకవర్గాల ఇన్‌చార్జీల నియామకం

- జహీరాబాద్‌కు సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్‌కు జీవన్‌రెడ్డి





సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆయా లోక్‌సభ స్థానాలకు ఇన్‌చార్జీలను నియమించింది. ఈ మేరకు సోమవారం పార్టీ నాయకత్వం ఇన్‌చార్జీల జాబితాను విడుదల చేసింది. జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి ఇన్‌చార్జీగా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. నిజామాబాద్ స్థానానికి ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని నియమించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడంతో ఈసీ షెడ్యూల్ ప్రకటనకు ముందే ఎంపీ అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాంధీభవన్‌లో రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం ముగిసిన వెంటనే ఇన్‌చార్జీలను ప్రకటించడం విశేషం.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి క్రైం: కామారెడ్డిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, దీనికి తన వంతు సహకారం అందిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలో అవినీతి రహిత, పారదర్శక పాలన అందించాలన్నదే తన లక్ష్యమన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్ దేవాలయం, అధికారులు దేవుళ్లలాంటి వారన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడులు ఎదురైనా నిజాయితీ కలిగి ఉండాలని సూచించారు. తాను ప్రజలకు ఉపయోగపడే సమస్యల గురించి మాత్రమే అధికారులను అడుగుతానని చెప్పారు. అధికారులు కూడా అంతే నిజాయితీగా స్పందిస్తూ వాస్తవాలను తెలపాలని కోరారు. పలు శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, ప్రగతిలో ఉన్న పనులు, వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. త్వరలలో శాఖల వారీగా సమీక్ష జరుపుతానని పేర్కొన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల అమలు, పనుల విషయంలో జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో బహిరంగ ప్రదేశాలు అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. జిల్లా కేంద్రంలో రెండు చోట్ల రైల్వే వంతెనలు, 10 బ్రిడ్జిల నిర్మాణాల ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలెక్టరేట్ అధికారులు సన్మానించారు. ఆర్‌డీవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

రాజన్న సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు, కుమారుడిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి ప్రసాదం అందజేశారు.

బాలికల హాకీ విజేత నిజామాబాద్

- బాలుర విభాగంలో విన్నర్‌గా ఆదిలాబాద్ జట్టు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్‌-14 బాలబాలికల హాకీ టోర్నీ సోమవారం ముగిసింది. బాలుర విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు, బాలికల విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు విజేతలుగా నిలిచాయి. బాలుర విభాగంలో నిజామాబాద్ జట్టు ద్వితీయ స్థానం, రంగారెడ్డి జిల్లా జట్టు తృతీయ స్థానం పొందాయి. బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో హైదరాబాద్ జట్టు, తృతీయ స్థానంలో రంగారెడ్డి జట్టు నిలిచాయి. విజేతలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త బెల్లాల్ శైలి, కామారెడ్డి డీఈవో ఎస్.రాజు ట్రోఫీలను ప్రదానం చేశారు. క్రీడల్లో పది ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులు, 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల రాష్ట్ర జట్టు..

జస్విత, శ్రీనిధి, వీణ, వైష్ణవి, గంగోత్రి, అఖిల, సింధూజ(నిజామాబాద్), మౌనిక, సాగ్వీ, నవ్యశ్రీ (హైదరాబాద్), దీక్షిత, శైలజ, వర్షిత (రంగారెడ్డి), శ్రీవైష్ణవి, కే.రక్షిత (మహబూబ్‌నగర్), అద్విత (వరంగల్), ఎస్‌కే.అయేషా (నల్గొండ), అమృత(మెదక్), మనీష, ఎం.దివ్య (ఆదిలాబాద్), రిషిక (కరీంనగర్).

బాలుర రాష్ట్ర జట్టు..

భరత్, కృష్ణ, శివ శరత్, అక్షయ్, శంకర్ (నిజామాబాద్), జే.చరణ్, ఎస్.ప్రమోద్, మోతీరాం, శంభు (ఆదిలాబాద్), నాగేందర్, మహేష్ (మహబూబ్‌నగర్), జ్ఞానేశ్వర్, సాయి చరణ్ (రంగారెడ్డి), ఎంఏ.హస్నన్, అఖిల్(వరంగల్), టి.రికిష్(మెదక్), కే.రుత్విక్ (కరీంనగర్), ఎన్.రుత్విక్(ఖమ్మం), అఖిల్ (నల్గొండ), నిఖిల్‌చంద్(హైదరాబాద్).



విజేతగా నిలిచిన నిజామాబాద్ బాలికల జట్టు

వచ్చే నెలలో జాతీయ స్థాయి కబడ్డీ క్రీడలు

జనవరిలో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కబడ్డీ అండర్‌-17 బాలుర క్రీడలకు కామారెడ్డి వేదిక కాబోతుంది. దేశంలోని 42 జట్లు, 600 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొంటారని డీఈవో రాజు తెలిపారు. జాతీయ క్రీడలను విజయవంతం చేయడానికి ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని ఆయన వ్యాయామ ఉపాధ్యాయులను కోరారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

బాన్సువాడ: విద్యార్థులు ఒక లక్ష్యంతో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బాన్సువాడలోని సరస్వతి ఫంక్షన్ హాల్‌లో షెడ్యూల్ కులాల, వెనకబడిన తరగతులు, గిరిజన అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో వసతి గృహాల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు సోమవారం అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ ప్రేరణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతుందని, ప్రతీ రోజు ప్రణాళికలు వేసుకుని సబ్జెక్టుల వారీగా చదువుకోవాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, ప్రతీ సబ్జెక్టుపై దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల జిల్లా అధికారి రజిత, వెనుక బడిన తరగతుల వెల్ఫేర్ జిల్లా అధికారి శ్రీనివాస్, గిరిజన అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వసతి గృహాల వార్డెన్లు శివగంగ, యాదగిరి, గంగసుధ, విజయశాంతి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి అయ్యప్ప ఆలయాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం రాత్రి ఎల్లారెడ్డిలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాదాయ శాఖతో మాట్లాడి అయ్యప్ప ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, సామెల్,ఆరిఫ్,చెన్న లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



లింగంపేట(ఎల్లారెడ్డి): భవానిపేట ఉన్నత పాఠశాలకు చెందిన దీపిక 42వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు తెలిపారు. ఉమ్మడి నిజామాబాదు జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేయడానికి ఉప్పల్‌వాయిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన దీపిక, రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదన్‌మోహన్‌రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు దీపికను అభినందించారు. ఈ నెల 20 నుంచి 23 వరకు ఉమ్మడి ఆదిలాబాదులోని కొమరంభీమ్ ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో దీపిక పాల్గొననున్నట్లు తెలిపారు.

రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి నుంచి..



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్- 14 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న నిఖిల్, రమేష్ ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్ తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీలలో ఆసిఫాబాద్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, కామారెడ్డికి చెందిన గౌస్ మద్యం సేవించి పట్టుబడినట్లు ఎస్సై మురళి తెలిపారు. అతడిని కామారెడ్డి ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ ఎదుట హాజరుపర్చగా.. రెండురోజుల జైలుశిక్ష విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

నిజామాబాద్‌రూరల్: మతిస్థిమితం కోల్పోయిన జిల్లా కేంద్రంలోని కోటగల్లికి చెందిన బుడిగే మల్లేశ్‌గౌడ్(49) మృతిచెందినట్లు రూరల్ ఎస్సై మహేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. గత 15 సంవత్సరాలుగా మల్లేశ్‌గౌడ్ రోడ్లపై తిరుగుతూ చెత్త ఏరడంతోపాటు భిక్షాటన చేసేవాడన్నారు. మాధవనగర్ డ్రైనేజీలో చెత్త ఏరుకుంటూ ప్రమాదవశాత్తు అక్కడే పడి మృతి చెందాడన్నారు. మృతుడి తమ్ముడు సతీశ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అవే సమస్యలు.. అవే సమాధానాలు

- ప్రభుత్వం మారినా ప్రజావాణికి తరలివస్తున్న ఫిర్యాదుదారులు



ఫిర్యాదులను పరిశీలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. పింఛన్లతోపాటు ధరణి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సదరం సర్టిఫికెట్లు, విద్యారంగం తదితర సమస్యలపై వినతిపత్రాలు అందుతున్నాయి. ధరణి సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు అవే సమస్యలపై వినతిపత్రాలు అందిస్తుండగా.. అధికారులు పాత సమాధానాలే చెబుతున్నారు. ప్రభుత్వం మారినా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపడం లేదని ఫిర్యాదుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పట్టా పాస్‌బుక్కు ఇవ్వడం లేదు



మాది నిజామాబాద్ రూరల్ మండలం గుండారం. ధరణి పట్టాపాస్ బుక్కులో 30 గుంటల భూమి నమోదు కాలేదు. మేమే కబ్జాలో ఉన్నాం. నా భర్త బాలయ్య, నేనూ కలిసి నాలుగేళ్లుగా తిరుగుతున్నాం. ఆన్‌లైన్‌లో వచ్చింది. పట్టా పాస్‌బుక్కు వచ్చిందని చెబుతున్న అధికారులు.. మాకు ఇవ్వకుండా పోస్టులో పంపిస్తామని ఏడాదిగా తిప్పుతున్నారు. ఇక్కడిఅధికారు లు మండల అధికారులకు ఫోన్ చేయగా, పంపించాలని చెప్పారు. – జరేవేటి చిన్నమ్మ, గుండారం

వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

- పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి
- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ప్రజావాణి సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 66 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారి నుంచి కలెక్టర్‌తోపాటు టు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, డీఆర్డీవో చందర్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు ఫిర్యాదులను స్వీకరించారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్నా, వినతి..

ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి మహేశ్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరి చక్రపాణి డిమాండ్‌చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

22గుంటల భూమి నమోదు కాలేదు



బాల్కొండలో 22 గుంటల భూమి ధరణి వచ్చిన తర్వాత ఇచ్చిన పాస్‌బుక్కులో రాలేదు. పాత బుక్కులో ఉంది. మేమే కబ్జాలో ఉన్నాం. రెండేళ్ల కింద బిడ్డ పెళ్లి చేయడంతో రూ.20లక్షల వరకు అప్పు అయ్యింది. ఆ భూమి అమ్ముదామంటే కొత్త బుక్కులో నమోదు కాలేదు. ఏడాదిగా తిరుగుతున్నాం. హైదరాబాద్ కార్యాలయానికి పంపిస్తే.. అక్కడి అధికారులు వాపస్ పంపుతున్నారని చెబుతున్నారు. ఇప్పుడు మళ్లీ పంపిస్తామని సమాధానమిచ్చారు. అప్పుల బాధ తాళలేక నా భర్త అచ్చారం అచ్చన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్నాడు. భూమి బుక్కులో నమోదు చేస్తే అమ్మేందుకు అవకాశం ఉంటుంది. లేకపోతే చావే దిక్కు.

– అచ్చారం రాజు, బాల్కొండ

సదరం సర్టిఫికెట్‌లో తప్పులు మార్చాలి



నా కూతురు అశ్విని అంధురాలు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని దేవ్‌నగర్ అంధుల కళాశాలలో మొదటిసంవత్సరం చదువుతోంది. సదరం సర్టిఫికెట్‌లో పేరు, ఆధార్‌నంబర్, పుట్టిన తేదీ తప్పుగా నమోదు చేశారు. ఇటీవల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు వెళ్లగా, తప్పుగా ఉందని దరఖాస్తును అనుమతించడం లేదు. సర్టిఫికెట్‌లో తప్పుగా నమోదైన వివరాలను మార్చాలని ఏడాదిగా తిరుగుతున్నా. నేటికీ సరి చేయలేదు. ఎప్పటిలోగా సరిచేస్తారని అడిగితే 15 రోజులు, నెల, రెండు నెలలైనా పట్టొచ్చని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. వెంటనే తప్పులను సరి చేయాలి.

– కె పవిత్ర, పెద్దబజార్, నిజామాబాద్

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



కామారెడ్డిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 74 ఫిర్యాదులు అందగా, వాటిలో 34 ఫిర్యాదులు రెవెన్యూకు సంబంధించినవి కాగా, 15 జిల్లా పంచాయతీ అధికారి, 10 హౌసింగ్ శాఖ, మిగతావి ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, డీఆర్డీవో సాయన్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలపై కలెక్టర్ నజర్

కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ధరణిపై ఎక్కువగా ఫోకస్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ పాటిల్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు జిల్లాలోని భూసమస్యల పరిష్కారంపై ఎక్కువగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కలెక్టర్ పాటిల్ ప్రజావాణిలో ఒక్కో దరఖాస్తును నిశితంగా పరిశీలించి బాధితులకు సమాధానం ఇవ్వడం, సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేయడం కనిపించింది. గతంలో కన్నా ఈసారి భూ సంబంధిత దరఖాస్తుల పరిశీలన, పరిష్కార దృక్పథంలో తేడా స్పష్టంగా ఉంది.

బేస్‌బాల్ విజేత ఉమ్మడి నిజామాబాద్



విజేతగా నిలిచిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన 67వ స్కూల్‌గేమ్స్ అండర్–17 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. సోమవారం నిర్వహించిన ఫైనల్స్‌లో కరీంనగర్ జట్టుపై 10 –0 తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు, నాయక్ రసూల్ తెలిపారు. టోర్నీ అబ్జర్వర్ మర్కంటి గంగామోహన్, మహబూబాబాద్ జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి జ్యోతి విజేతలకు బహుమతులను అందజేశారు.జిల్లా జట్టుకు కోచ్, మేనేజర్లుగా భాగ్య, వినోద్, గంగాధర్ వ్యవహరించారు.

జాతీయస్థాయికి ఎంపిక

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో చక్కని ప్రతిభ చూపిన జిల్లా క్రీడాకారులు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు తెలిపారు.

బాలికల విభాగం: నక్షత్ర, శరణ్య(సాంఘిక సంక్షేమ పాఠశాల, ధర్మారం), గంగోత్రి, జాస్మిన్(సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి), ఎన్.సాహితి, పి వైష్ణవి (సాంఘిక సంక్షేమ పాఠశాల, ఆర్మూర్).

బాలుర విభాగం: విష్ణు (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మిట్టపల్లి), విష్ణువర్ధన్ (సాంఘికసంక్షేమ పాఠశాల, ఆర్మూర్).

మహ్మద్ నహీద్‌కు ఉర్దూలో డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం స్కాలర్ మహ్మద్ నహీద్ అలీ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ ఉర్దూ అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ అబ్దుల్ ఖవి పర్యవేక్షణలో 'హైదరాబాద్ కే నామవార్ –సహాఫియాన్ కి అదబి వావ్ సహాఫాతి ఖిద్మట్ (అజాదీ కే బాద్)' అనే అంశంపై నహీద్ అలీ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఓపెన్ వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ అబ్దుల్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధకుడిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పీహెచ్‌డీ సాధించిన నహీద్ అలీని తెయూ రిజిస్ట్రార్ ఎం యాదగిరి, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వి త్రివేణి, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ, ఉర్దూ హెచ్‌వోడీ మహమ్మద్ మూసా తదితరులు అభినందించారు.

శునకాలకు ప్రత్యేక పూజలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని కోడిచిర, మద్నూర్, తడిహిప్పర్గ, సిర్‌పూర్, డోంగ్లీ తదితర గ్రామాల్లో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శునకాలకు ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్ర సాంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం కార్తీక అమావాస్య అనంతరం శునకాలకు పూజలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ సందర్భంగా మహిళలు ఉదయం శునకాలకు పూలహారాలు వేసి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు తినిపించారు.

క్రైం కార్నర్

గోదావరిలో బాలుడి మృతదేహం

- మాక్లూర్‌కు చెందిన ప్రసాద్ కుమారుడు చైత్రిక్‌దిగా గుర్తింపు
- పదిరోజుల క్రితమే లభ్యమైన కూతురు చైత్రిక మృతదేహం



చైత్రిక్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యబృందం

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం గ్రామ శివారులోని గోదావరిలో మాక్లూర్ మండలకేంద్రానికి చెందిన ప్రసాద్ కుమారుడు చైత్రిక్(10) మృతదేహాన్ని మెండోరా పోలీసులు సోమవారం గుర్తించారు. సంచలనంగా మారిన ప్రసాద్ కుటుంబ సభ్యుల హత్య ఘటనపై సదాశివ్‌నగర్‌లో నమోదైన కేసులో భాగంగా పోలీసులు నిందితుడిని విచారించి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టగా.. కు ళ్లిన స్థితిలో బాలుడి మృతదేహం లభ్యమైంది. ఈనెల 8న ఇదే ప్రాంతంలో లభించిన బాలిక మృతదేహం ప్రసాద్ కూతురు చైత్రిక(10)దిగా పోలీసులు గుర్తించారు.బాలుడి మృతదేహం పూర్తిగా కు ళ్లిపోవడంతో వైద్యులు అక్కడే పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతదేహాన్ని ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, మెండోరా ఎస్సై పరిశీలించి కేసు నమోదు చేశారు.

కొత్తపల్లిలో లభించిన మృతదేహం ఎవరిదో..?

ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులోని పంట భూముల్లో ఈనెల 10న సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతదేహం లభించింది. ఆ మృతదేహం సైతం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనాస్థలంలోనే పోస్టుమార్టం చేశారు. వరుస హత్యల ఉదంతం బయట కుపొక్కడంతో.. కొత్తపల్లి శివారులో గుర్తించిన మృతదేహం ఎవరిదోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

నాగంపేట్‌లో రగిలిన భూ వివాదం

- వివాదాస్పద భూమిలో నాట్లు వేసిన సొసైటీ సభ్యులు
- ఘటనాస్థలం వద్దే వంట, భోజనం
- అధికారుల సూచన మేరకు సర్వేకు అంగీకరించిన ఇరువర్గాలు



ముప్కాల్ ఎస్సైతో వాగ్వాదానికి దిగిన సహకార సంఘం సభ్యులు

బాల్కొండ:ముప్కాల్ మండలం నాగంపేట్‌లో భూ వివాదం మళ్లీ రగిలింది. కొన్నాళ్లుగా గ్రామంలోని గురడికాపు సంఘం సభ్యులకు, సహకార సంఘం (ఎస్టీ,ఎస్సీ, బీసీ, మైనార్టీ) సభ్యులకు మధ్యం సర్వే నంబరు 494 విషయంలో వివాదం నెలకొంది. ఇది లా ఉండగా, తమకు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని సహకార సంఘం సభ్యులు వివాదాస్పదంగా మారిన ఎకరం 19 గుంటల భూమిలో వరి నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. వివాదం కోర్టు పరిధిలో ఉండగా, వరినాట్లు ఎలా వేస్తారని రెండు వర్గాల మధ్య ఆదివారం రాత్రి నుంచి వివాదం తలెత్తింది. సోమవారం ఉదయం ఇరువర్గాల వారు భూమి వద్దకు చేరుకున్నారు.ఆలోగా ముప్కాల్ ఎస్సై భాస్కరచారి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నాట్లు వేయొద్దని సహకార సంఘం సభ్యులకు సూచించారు. దీంతో సహకార సంఘం సభ్యులు గతంలో గురడిరెడ్డి సంఘం వారు సాగు చేస్తే పట్టించుకోలేదని వాగ్వాదానికి దిగారు. ట్రాక్టర్ లోపలికి రాకుండా అడ్డుకోగా, పంట పొలాల్లో నుంచి ట్రాక్టర్‌ను తీసుకువచ్చి రొటవేటర్ చేశారు. అనంతరం మహిళలు, పురుషులు కలిసి వరి నాట్లు వేయడం పూర్తి చేశారు. ఆ తరువాత మెండోరా తహసీల్దార్ సంతోష్ , ఆర్‌ఐ సాయాగౌడ్, ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాల్కొండ, మెండోరా ఎస్సైలు గోపి, శ్రీనివాస్, సీఆర్పీఎఫ్ బలగాలు ఘటన స్థలానికి చేరుకున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అయినప్పటికీ సహకార సంఘం సభ్యులు తాము సాగు చేస్తున్న భూమి 494 సర్వే నంబరులోనిది కాదని చెప్పారు. ఇక్కడి అధికారులపై తమకు నమ్మకం లేదని, కోర్టు నుంచి సర్వేకు వస్తేనే అంగీకరిస్తామన్నారు. పోలీసులు ఎంత సముదాయించినా వినిపించుకోలేదు. ఉన్నతాధికారులు వచ్చి సర్వే చేపట్టి న్యాయం చేసే వరకు కదిలేది లేదన్నారు. వివాదాస్పద స్థలం వద్ద వంటలు చేసుకుని భోజనాలు చేశారు. చివరికి రెండు వర్గాల సభ్యులు సర్వేకు అంగీకరించారు. ప్రస్తుతం వేసిన వరి నాట్లను తొలిగించాలని గురడిరెడ్డి సంఘంవారు సూచిండంతో కథ మళ్లీ మొదటికొచ్చి సోమవారం సాయంత్రం వరకు వివాదం కొనసాగింది.

మరో మహిళతో ఉన్న భర్తను పట్టుకున్న భార్య

బాన్సువాడ :తన భర్త మరో మహిళతో కలిసి ఓ లాడ్జీలో ఉన్న విషయం తెలుసుకున్న భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన సోమవారం బాన్సువాడలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పిట్లం మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మహమ్మద్ ఇస్మాయిల్ ఓ వివాహితను బాన్సువాడ పట్టణంలోని ఓ లాడ్జీకి తీసుకొచ్చాడు. విషయం తెలుసుకున్న ఇస్మాయిల్ భార్య పోలీసులను వెంటపెట్టుకుని లాడ్జీకి వెళ్లింది. ఇస్మాయిల్‌తోపాటు సదరు మహిళను పోలీసులకు అప్పగించింది. పోలీసులు ఇరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

భార్యను హత్యచేసిన భర్తకు జీవితఖైదు

ఖలీల్‌వాడి/వేల్పూర్: భార్యతను హత్య చేసిన భర్తకు జీవిత కారాగారశిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ నిజామాబాద్ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కనకదుర్గ సోమవారం తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వేల్పూర్ మండలం మోతెకు చెందిన భార్యాభర్తలు ముద్దుల ముత్తెన్న, ముద్దుల సాయమ్మ కొన్ని కారణాలతో విడాకులు తీసుకున్నారు. సాయమ్మ తన కూతురు భారతి పేరుపై 30గజాల ఖాళీ స్థలం, అర ఎకరం భూమి రాసివ్వగా, తల్లీకూతుళ్లు మోతెలోనే వేరుగా ఉంటున్నారు. కొద్దిరోజుల తరువాత ఆధార్‌కార్డులో ఇంటి పేరును ముద్దులకు బదులుగా దాప అని మార్చుకోవాలని గొడవపడ్డాడు. తన ఇంటిపేరునే ఆధార్‌కార్డులో వాడితే మళ్లీ తన ఇంటినిసైతం ఇవ్వమంటారని ముత్తెన్న సాయమ్మతో గొడవకు దిగాడు. ఆమెపై కక్షపెంచుకున్న ముత్తెన్న 29 నవంబర్ 2015న సాయమ్మతో గొడవపడి ఆమె తలపై పారతో దాడి చేసి హత్య చేశాడు. అడ్డుపడిన బావమరిదిని కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. కోర్టు విచారణలో ముత్తెన్నపై హత్య, హత్యాయత్నం, వరకట్న విధింపుల నేరాలు రుజువయ్యాయి. హత్యా నేరానికిగాను జీవితఖైదు, హత్యాయత్నం నేరానికిగాను ఒకనెల జైలుశిక్ష, వరకట్న వేధింపులకుగాను మూడేళ్ళ కఠిన జైలుశిక్షను న్యాయస్థానం ఖరారు చేసింది. వేల్పూర్ పోలీసుల తరఫున డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ప్రాసిక్యూషన్ నిర్వహించారు. జైలుశిక్ష ఖరారు పత్రం, కోర్టు తీర్పు ప్రతి స్వీకరించిన ఎస్కార్ట్ పోలీసులు ముత్తెన్నను నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించారు.సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చిన ఎస్సై వినయ్‌కుమార్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ సురేశ్‌గౌడ్‌ను సీపీ అభినందించారు.

ఆర్థిక పరిహారానికి సిఫార్సు

తల్లి హత్యకు గురికావడం, తండ్రికి జైలుకు వెళ్లడంతో, ముత్తెన్న, సాయమ్మల కూతురు భారతికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ తగిన ఆర్థికపరిహారం అందించాలని న్యాయమూర్తి తీర్పులో సిఫార్సు చేశారు. భారతి భవిష్యత్ అవసరాల నిమిత్తం ఆర్థికపరిహారం అందజేయాలన్నారు.

చెరువులోపడి ఒకరి మృతి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దేవనబోయిన నాగరాజు (42) వంటలు చేస్తూ జీవించేవాడు. ఈనెల 15న రాత్రి ఇంట్లో ఫోన్ చార్జింగ్ పెట్టి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం పలువురిని విచారించగా.. ఓ వ్యక్తి బైక్‌పై జాతీయ రహదారిపై వెళ్లినట్లు చెప్పారు. గ్రామంలోని చెరువులో నాగరాజు మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. మృతుడి భార్య నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు..



ఘటనాస్థలంలో రాములు మృతదేహం

మద్నూర్(జుక్కల్): మండలంలోని చిన్న ఎక్లారకు చెందిన రైతు సోలాస్కర్ రాములు (52) విద్యుత్ షాక్‌కు గురై సోమవారం మృతిచెందినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మొక్కజొన్న పంటకు నీరు పెడుతుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన రాములు విద్యుత్‌సరఫరా ఎందుకు నిలిచిపోయిందని తెలుసుకునేందుకు హ్యాండిల్‌ను ముట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరు ..

డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. డిచ్‌పల్లి ఎస్సై మహేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌రాష్ట్రానికి చెందిన సురేంద్ర (45) ఈ నెల 16న సాయంత్రం మినీ కంటెయినర్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్నాడు. డిచ్‌పల్లి మండలం బీబీపూర్ తండా శివారులోని 44వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న కాన్పూర్ దాబా వద్ద కంటెయినర్‌ను ఆపి రోడ్డు దాటుతుండగా సురేంద్రను బైక్ ఢీకొట్టింది. వెంటనే అతడిని జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ములాయంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జక్రాన్‌పల్లి ఘటనలో..

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈ నెల 17న రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో గాయాలపాలైన పూజారి మనీషా(28) ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మనీషా మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

బోర్లంక్యాంపులో చోరీ



ఆభరణాలు దొంగిలించి పట్టుబడిన వ్యక్తి

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపునకు చెందిన కుర్మ రాజప్ప ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపు తాళంతోపాటు బీరువా పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. బీరువాలో దాచిన ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, యువకులు బాధితుల వద్దకు వచ్చి విషయం తెలుసుకున్నారు. సమీపంలోనే గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో పడుకుని ఉండడాన్ని గమనించిన యువకులు అతడిని విచారించగా, రాజప్ప ఇంట్లో చోరీకి గురైన ఆభరణాలు లభ్యమయ్యాయి. సదరు వ్యక్తికి దేహశుద్ధి చేసిన యువకులు పోలీసులకు అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి గాంధారి మండలం కన్కల్‌కు చెందిన వాడిగా గుర్తించారు.